సాక్షి
రాజన్న సిరిసిల్ల
శనివారం । 27 । ఏప్రిల్ । 2024



రాజన్నకు మొక్కులు

వేములవాడ: రాజన్నను శుక్రవారం 10వేల మంది భక్తులు దర్శించుకున్నారు. భక్తుల ద్వారా రూ.12 లక్షల ఆదాయం సమకూరినట్లు ఆలయ అధికారులు తెలిపారు.

గరిష్టం/కనిష్టం
43.0/28.0

వాతావరణం

ఆకాశం నిర్మలంగా ఉంటుంది. అప్పడప్పుడు మేఘావృతమయ్యే అవకాశం ఉంది. వర్షం కురిసే అవకాశం లేదు.

న్యూస్‌రీల్

అనధికారికంగా సైరన్‌లు అమర్చితే చర్యలు

- ఎస్పీ అఖిల్ మహాజన్


ఎస్పీ అఖిల్ మహాజన్

సిరిసిల్లక్రైం: అత్యవసర వాహనాలకు మినహా ఇతర వాహనాలకు సైరన్లు అమర్చితే చట్టపరిధిలో చర్యలు తీసుకుంటామని ఎస్పీ అఖిల్ మహాజన్ హెచ్చరించారు. వాహనాదారులు రోడ్డు, ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని సూచించారు. పలు విషయాలను శుక్రవారం వెల్లడించారు. మైనర్లకు వాహనాలు ఇస్తున్న తల్లిదండ్రులపై, వాహన యజమానులపై కేసులు నమోదు చేస్తామన్నారు. నెల రోజుల్లో నిబంధనలకు విరుద్ధంగా సైరన్లు బిగించిన 5 వాహనాల యజమానులపై కేసులు నమోదు చేసి, వాహనాలను సీజ్ చేసినట్లు తెలిపారు. ట్రిపుల్ రైడింగ్ చేసిన 159 మందికి జరిమానా విధించామని, వాహనాలు నడుపుతున్న 23 మంది మైనర్లపై కేసులు నమోదు చేసినట్లు వివరించారు. డబుల్ సైలెన్సర్లు బిగించి శబ్ద కాలుష్యానికి కారణమవుతున్న 27 వాహనాలను సీజ్ చేసినట్లు తెలిపారు.

ఓటుహక్కు పౌరుల బాధ్యత

- జెడ్పీ సీఈవో ఉమారాణి


ప్రతిజ్ఞ చేస్తున్న మహిళలు

సిరిసిల్ల: రాజ్యాంగం కల్పించిన ఓటుహక్కును వినియోగించుకోవాలని, ఓటుహక్కు పౌరుల బాధ్యత అని జెడ్పీ సీఈవో ఉమారాణి పేర్కొన్నారు. జెడ్పీ ఆఫీస్‌లో శుక్రవారం సూర్యోదయ మండల మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో స్వీప్‌లో భాగంగా అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఉమారాణి మాట్లాడుతూ 18 ఏళ్లు నిండిన ప్రతీ ఒక్కరు ఓటరుగా పేరు నమోదు చేసుకోవాలని, ఓటుహక్కు ఉన్న వారు ఓటు వేయాలని కోరారు. వందశాతం పోలింగ్ జరిగితే ఓటర్లు చైతన్యవంతులైనట్లేనన్నారు. మహిళా సంఘాల సభ్యులు క్షేత్రస్థాయిలో పోలింగ్ శాతం పెంచేందుకు ఓటర్లను చైతన్యవంతులను చేయాలని కోరారు. స్వీప్ నోడల్ అధికారి, అడిషనల్ డీఆర్‌డీవో గొట్టి శ్రీనివాస్, జిల్లా సమాఖ్య అధ్యక్షురాలు సరిత, డీపీఎం పద్మయ్య, ఏపీఎం పర్శరాములు, సీసీలు డి.కిష్టస్వామి, తిరుపతి, శ్రీనివాస్, ఎల్లయ్య, రాజనర్సు, మండలంలోని వీవో అధ్యక్షులు పాల్గొన్నారు.


నేతన్నలకు సీఎం భరోసా కల్పించాలి

- చేనేత ఐక్యవేదిక రాష్ట్ర యూత్ వర్కింగ్ ప్రెసిడెంట్ మహేశ్

తంగళ్లపల్లి(సిరిసిల్ల): సిరిసిల్ల నేతకార్మికులకు ఉపాధికరువై ఆత్మహత్యలకు పాల్పడుతున్న తరుణంలో సీఎం రేవంత్‌రెడ్డి భరోసా కల్పించాలని తెలంగాణ చేనేత ఐక్య వేదిక రాష్ట్ర యూత్ వర్కింగ్ ప్రెసిడెంట్ అంకారపు మహేశ్ కోరారు. తంగళ్లపల్లిలో శుక్రవారం విలేకరులతో మాట్లాడారు. నేతకార్మికులు ఆత్మహత్యలు చేసుకోవద్దని ఆత్మస్థైర్యంతో పోరాడదామన్నారు. గత ప్రభుత్వం చేనేత, పవర్‌లూమ్ కార్మికులకు తీరని అన్యాయం చేసిందని, స్వతహాగా నడిచే వ్యవస్థని తమ గుప్పిట్లో పెట్టుకుందని ఆరోపించారు. సిరిసిల్లకు కేటాయించిన కాకతీయ మెగా టెక్స్‌టైల్ వరంగల్‌కు తరలిపోతే అప్పటి మంత్రి కేటీఆర్ స్పందించలేదన్నారు. కేంద్ర ప్రభుత్వం నూలు వస్త్రాలపై జీఎస్టీని తొలగించాలని, జియో ట్యాగింగ్ విధానం రద్దు చేయాలని కోరారు. రైతుల ధాన్యం కొన్నట్లుగా.. నేతన్నలు తయారు చేసిన వస్త్రాన్ని సైతం ప్రభుత్వమే కొనాలని డిమాండ్ చేశారు.

నేతకార్మికులు పోరాడి గెలవాలి

- ఏఐఎఫ్‌టీయూ న్యూ రాష్ట్ర నాయకుడు దశరథం


మాట్లాడుతున్న సోమిశెట్టి దశరథం

సిరిసిల్లటౌన్: నేతకార్మికులు పోరాడి గెలవాలే తప్ప.. కుంగిపోయి ప్రాణాలు తీసుకోవద్దని ఏఐఎఫ్‌టీయూ న్యూ రాష్ట్ర నాయకుడు సోమిశెట్టి దశరథం కోరారు. సిరిసిల్లలోని పార్టీ ఆఫీసులో శుక్రవారం నిర్వహించిన కార్యకర్తల సమావేశంలో మాట్లాడారు. కొద్ది రోజులుగా సిరిసిల్లలో మళ్లీ నేత కార్మికులు బలవన్మరణాలకు పాల్పడడం బాధాకరమన్నారు. ప్రభుత్వం బకాయిలు పూర్తి స్థాయిలో ఇచ్చి, వస్త్రోత్పత్తి ఆర్డర్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కూరపాటి సతీశ్, కుడిక్యాల లక్ష్మణ్, గుజ్జె దేవదాసు తదితరులు పాల్గొన్నారు.

వడ..దడ

- జిల్లాలో అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదు
- ఠారెత్తిపోతున్న జనం
- గత వారంలో గరిష్టంగా 44.5 డిగ్రీలు
- శుక్రవారం 43 డిగ్రీలు
- మరో మూడు రోజులూ ఇదే పరిస్థితి

వారం రోజులుగా నమోదైన ఉష్ణోగ్రతలు

తేది	ఉష్ణోగ్రతలు
19	44.5
20	41.2
21	38.2
22	42.9
23	40.0
24	41.0
25	42.0
26	43.0


నిర్మానుష్యంగా మారిన అంబేడ్కర్ చౌరస్తా



సిరిసిల్లకల్చరల్: ఎండలు మండిపోతున్నాయి. గత వారం రోజులుగా సూర్యుడు ప్రతాపం చూపుతున్నాడు. రోజూ 40 డిగ్రీల సెల్సియస్‌లు దాటుతుండడంతో జనం ఠారెత్తిపోతున్నారు. మధ్యాహ్నం వేళ బయటకు వచ్చేందుకు జంకుతున్నారు. రెండు రోజులపాటు 44.5 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. మరో మూడు రోజులు సైతం అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశం ఉందని వాతావరణశాఖ హెచ్చరించింది. ప్రస్తుతం రాజన్నసిరిసిల్ల జిల్లా ఆరేంజ్ అలర్ట్‌లో ఉంది.

రోడ్లు నిర్మానుష్యం

ఉదయం 10 గంటలు దాటితే చాలు జిల్లాలోని ప్రధాన రహదారులు నిర్మానుష్యంగా మారుతున్నాయి. అత్యవసర పని ఉన్న వారు మాత్రమే బయటకు వస్తున్నారు. చిరు వ్యాపారులు, వైద్యసేవలు అవసరం ఉన్న వారే రోడ్లపై కనిపిస్తున్నారు. ఎండ తీవ్రతతో చల్లటి పానియాలు, చెరుకు రసం తాగేందుకు ప్రాధాన్యత ఇస్తున్నారు.

వడదెబ్బ లక్షణాలు ఇవీ..

విపరీతమైన జ్వరంతోపాటు కళ్లు తిరగడం, వాంతులు, విరేచనాలు అవుతుంటాయి. నాలుక పొడి బారుతుంది. శరీరంలోని లవణాలు నష్టపోతాయి. ఇది గుండెపై ప్రభావం చూపే ప్రమాదం ఉంది.

నీడలోకి తీసుకెళ్లాలి..



వడదెబ్బ తాకిన వ్యక్తిని వెంటనే చల్లని ప్రదేశంలోకి తీసుకెళ్లాలి. చల్లటి నీళ్లు కాకుండా మామూలు నీళ్లు తాగించాలి. వీలైతే ఓఆర్ఎస్ కలపాలి. మజ్జిగ లేదా నిమ్మరసం ఇస్తే మరీ మంచిది. తేరుకున్నాక చల్లటినీటితో ముఖం కడుక్కోవాలి. పరిస్థితి తీవ్రతను బట్టి సమీపంలోని ఆస్పత్రిలోకి తీసుకెళ్లి చికిత్స అందించాలి. వదులుగా ఉన్న కాటన్ దుస్తులు ధరించడం ఉత్తమం.

– డాక్టర్ చీకోటి సంతోష్‌కుమార్, డిప్యూటీ సూపరింటెండెంట్, ఏరియా ఆస్పత్రి

మంచినీరే అసలైన మందు



నిత్యం కనీసం 5 నుంచి 6 లీటర్ల మంచినీరు తీసుకోవాలి. నీడలోనే పనులు చేసుకునేలా చూడాలి. ఉదయం 11 నుంచి సాయంత్రం 4 గంటల వరకు బయట తిరగకుండా జాగ్రత్త పడాలి. తప్పనిసరై బయటకు వెళ్లాల్సి వస్తే సరిపడినన్నీ మంచినీళ్లు తాగాలి. సహజంగా శరీరానికి 4 నుంచి 5 లీటర్ల నీరు అవసరం. వేసవిలో మరో రెండు లీటర్లు అదనంగా తీసుకోవాలి.

– డాక్టర్ జైల్‌సింగ్, ఎండీ ఫిజీషియన్

పసిపిల్లలు జాగ్రత్త



వేసవిలో చిన్నారుల ఆరోగ్యం విషయంలో జాగ్రత్తలు తీసుకోవాలి. నీరు, కొబ్బరినీరు, మజ్జిగ, పండ్లరసాలు తాగించాలి. కాటన్ దుస్తులు వేయడం ఉత్తమం. ఎండలో వెళ్లాల్సి వస్తే సన్‌స్క్రీన్ లోషన్లు రాయాలి. పిల్లలకు ఇచ్చే ఆహారంలో పుచ్చకాయ, దోసకాయ, పండ్లు, పెరుగును చేర్చాలి.

– డాక్టర్ తదుక సాయికుమార్, ఎండీ పిడియాట్రీషియన్

‘పెదరాయుడు’కు డిమాండ్

- సిరిసిల్ల సాంచాలపై నాణ్యమైన లుంగీలు
- మార్కెట్‌లో ఫుల్ డిమాండ్
- గ్రీన్, రెడ్ అంచులతో అందంగా ఉత్పత్తి
- నాణ్యమైన బట్టతో బతుకుదెరువు
- రామారావు ప్రయోగం స్ఫూర్తివంతం



గ్రీన్, రెడ్ అంచులతో లుంగీలు


సిరిసిల్ల దాబీ సాంచాలపై లుంగీల ఉత్పత్తి

సిరిసిల్ల: కాలానికి అనుగుణంగా మార్పులను స్వాగతిస్తేనే మనుగడ సాధ్యమని నమ్మి పాటించారు సిరిసిల్లకు చెందిన వస్త్రోత్పత్తిదారుడు రామారావు. అందరిమాదిరిగా ప్రభుత్వ ఆర్డర్లపై ఆధారపడకుండా వినూత్నంగా ఆలోచించారు. సిరిసిల్లలో ప్రస్తుతం ఉన్న పాత మగ్గాలపైనే నాణ్యమైన ‘పెద్దరాయుడు’ లుంగీలను ఉత్పత్తి చేస్తూ ఉపాధి పొందుతున్నారు. ఆ లుంగీలకు అవసరమైన నూలు(దారం)ను దిగుమతి చేసుకుని భీములు పోయించి స్థానిక వస్త్రోత్పత్తిదారులకు అందిస్తున్నారు. మార్కెట్ లేదని బాధపడే సిరిసిల్ల వస్త్రోత్పత్తిదారులకు స్ఫూర్తినిస్తూ రామారావు అవే పాత సాంచాలపై కొత్తరకం బట్టను ఉత్పత్తిచేస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారు.

ఆలోచనల్లో మార్పు..

మార్కెట్‌లో గిరాకీ ఉన్న బట్టను ఉత్పత్తి చేస్తే డిమాండ్ ఉంటుంది అని రామారావు నిరూపించారు. అవే సాంచాలపైన మార్కెట్‌లో డిమాండ్ ఉండే గ్రీన్, రెడ్ అంచులతో కూడిన లుంగీలను ఉత్పత్తి చేస్తున్నారు. ఓ వైపు గ్రీన్ అంచు, మరోవైపు రెడ్ అంచుతో కూడిన కాటన్, పాలిస్టర్ మిక్స్‌డ్ వస్త్రాన్ని తయారు చేయిస్తున్నారు. వెఫ్ట్ ధారాన్ని కాటన్, వార్ప్‌ను పాలిస్టర్ పోగులను వినియోగిస్తూ నాణ్యమైన వస్త్రాన్ని తయారు చేయిస్తున్నారు. నూలు కొనుగోలు చేసి 1.80 మీటర్ల బట్టను ఉత్పత్తి చేసినందుకు రూ.14.50 కూలీగా చెల్లిస్తున్నారు. సిరిసిల్లలో ప్రస్తుతం ఉన్న డాబీలు, పింజర్లపై ఈ లుంగీలను తయారు చేయడం సులభంగా మారింది. పాలిస్టర్ భీములు అందుబాటులో లేని ఆసాములు లుంగీల బట్టను ఉత్పత్తి చేస్తున్నారు.

నాణ్యమైన వస్త్రాలకు మార్కెట్

సిరిసిల్లలో ఉత్పత్తి అయ్యే నాణ్యమైన వస్త్రాలకు ఎప్పుడూ మార్కెట్ ఉంటుంది. టవల్స్, కర్చీఫ్‌లు, కాటన్‌వస్త్రాలు, దోమతెరలు ఉత్పత్తి చేసే ఆసాములకు ఏడాది పొడవునా ఉపాధి లభిస్తుంది. నాణ్యమైన వస్త్రాలను తయారు చేస్తే సిరిసిల్ల బ్రాండ్ ఇమేజ్ కలకాలం నిలిచి ఉంటుంది. సిరిసిల్ల నేతన్నలు ఉన్నంతలో నాణ్యమైన వస్త్రాలను తయారు చేస్తూ.. తమిళనాడు, షోలాపూర్, సూరత్, భీవండీ వంటి పారిశ్రామిక ప్రాంతాలతో పోటీపడితేనే భవిష్యత్‌లో బతుకుదెరువు ఉంటుంది. ఆ దిశగా సిరిసిల్ల నేతన్నలు ముందుకుసాగితేనే ఉపాధికి బాటలు పడతాయి.

ఇప్పుడిప్పుడే ముందుకొస్తున్నారు



ప్రస్తుతం నా వద్ద వంద వరకు లుంగీల భీములు సిద్ధంగా ఉన్నాయి. ఇప్పటికే 15 వరకు ఆసాములు తీసుకెళ్లారు. మిగితా భీములను ఇచ్చేందుకు నేను రెడీగా ఉన్నారు. కాటన్, పాలిస్టర్ మిశ్రమంగా లుంగీలను ఉత్పత్తి చేస్తున్నాను. మార్కెట్‌లో ఈ లుంగీలకు డిమాండ్ ఉంది. సిరిసిల్లలోని డాబీలు, పింజర్లపై లుంగీల ఉత్పత్తి సాధ్యమవుతుంది. మార్కెట్‌లో డిమాండ్ ఉన్న వస్త్రాన్ని ఉత్పత్తి చేస్తేనే బట్టకు గిట్టుబాటు లభిస్తుంది.

– రామారావు, లుంగీల వస్త్రోత్పత్తిదారుడు, సిరిసిల్ల

20 మంది అభ్యర్థుల నామినేషన్లు తిరస్కరణ


మాట్లాడుతున్న కలెక్టర్ పమేలా సత్పతి

కరీంనగర్: కరీంనగర్ లోక్‌సభ స్థానానికి దాఖలు చేసిన నామినేషన్ల పరిశీలన శుక్రవారం పూర్తయ్యింది. కరీంనగర్ లోక్‌సభ స్థానానికి ఈనెల 18 నుంచి 25వ తేదీ వరకు 53 మంది 94 సెట్ల నామినేషన్ పత్రాలు దాఖలు చేశారు. శుక్రవారం నామినేషన్ పత్రాల పరిశీలన అనంతరం ఎన్నికల కమిషన్ నిబంధనల ప్రకారం సక్రమంగాలేని 20 మంది అభ్యర్థుల నామిషన్లు తిరస్కరించినట్లు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ పమేలా సత్పతి వివరించారు. 33 మంది అభ్యర్థుల నామినేషన్లు సక్రమంగా ఉన్నాయని వివరించారు.

29 వరకు నామినేషన్ల ఉపసంహరణ

నామినేషన్ల పరిశీలన పూర్తయిన తర్వాత నుంచి ఎవరైనా అభ్యర్థులు నామినేషన్ ఉపసంహరించుకునే అవకాశం ఉందని కలెక్టర్ పమేలా సత్పతి వెల్లడించారు. కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో నామినేషన్ల పరిశీలన ప్రక్రియ ముగిసిన తర్వాత ఆమె మాట్లాడారు. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు శనివారం, ఆదివారం సెలవు ఉంటుందని తెలిపారు. సోమవారం ఉదయం నుంచి మధ్యాహ్నం మూడు గంటల్లోగా నామినేషన్లను అభ్యర్థులు ఉపసంహరించుకోవచ్చని తెలిపారు. అభ్యర్థులు ఎన్నికల నిబంధనలను తప్పనిసరి పాటించాలని సూచించారు. అభ్యర్థులు అప్రమత్తంగా వ్యవహరించాలని సూచించారు. సమయం మించిన తర్వాత వచ్చి ఇబ్బందులు పడవద్దని అన్నారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్లు ప్రఫుల్ దేశాయ్, లక్ష్మీకిరణ్, రాజన్న సిరిసిల్ల జిల్లా అదనపు కలెక్టర్ పూజారి గౌతమి, ట్రైనీ కలెక్టర్ అజయ్‌యాదవ్, కరీంనగర్, హుజూరాబాద్ ఆర్డీవోలు కె.మహేశ్వర్, రమేశ్‌బాబు, పలువురు అధికారులు, అభ్యర్థులు ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

అధికారం పోగానే ప్రజలు గుర్తుకొస్తున్నారు


చీర్లవంచలో మాట్లాడుతున్న ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

- ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

వేములవాడరూరల్: అధికారం పోగానే కేసీఆర్‌కు ప్రజలు గుర్తుకొస్తున్నారని ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ అన్నారు. వేములవాడఅర్బన్ మండలం చీర్లవంచలో శుక్రవారం నిర్వహించిన పార్టీ కార్యకర్తల సమావేశంలో మాట్లాడారు. కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి వెలిచాల రాజేందర్‌రావును గెలిపించాలని కోరారు. ముస్లింలకు ఆస్తి పంచుతారనడం, తాళిబొట్లు లాక్కుంటారని బీజేపీ వ్యాఖ్యానించడాన్ని చూస్తే ఆ పార్టీ నాయకులకు ఓడిపోతామనే భయం పట్టుకుందని ఎద్దేవా చేశారు. అంబేడ్కర్ రాసిన రాజ్యాంగాన్ని అమలు చేస్తానని ప్రమాణం చేసిన మోదీ భావోద్వేగాన్ని రెచ్చగొట్టి ఓట్లు దండుకోవాలని చూస్తున్నారన్నారు. 39 మంది ఎమ్మెల్యేలు గెలిచినా కేసీఆర్ అసెంబ్లీకి రాకపోవడంతో మనోధైర్యం కోల్పోయి ఎంపీలు, ఎమ్మెల్యేలు ఇతర పార్టీల్లోకి వెళ్తుంటే అధికారంలోకి వస్తామంటూ మేకపోతు గాంభీర్యం ప్రదర్శిస్తున్నారని ఎద్దేవా చేశారు. పార్టీ మండలాధ్యక్షుడు పిల్లి కనకయ్య, జిల్లా ఉపాధ్యక్షుడు ఎర్రం రాజు, బీసీ సెల్ జిల్లా ఉపాధ్యక్షుడు కత్తి కనకయ్య, ఎస్సీ సెల్ జిల్లా ఉపాధ్యక్షుడు చెర్ల మల్లేశం, కిసాన్ సెల్ మండలాధ్యక్షుడు ఇటిక్యాల లింగయ్య, బీసీ సెల్ మండలాధ్యక్షుడు బోనాల రమేశ్, గ్రామాధ్యక్షుడు ఈర్నాల గణేశ్, వైస్ ఎంపీపీ వనపర్తి దేవరాజు, ఎంపీటీసీలు బాస రాజశేఖర్, సువర్ణ, ప్రభాకర్, సత్తయ్య, ఆగయ్య, రవి, రాములు, మధు పాల్గొన్నారు.

ఆర్థిక ఇబ్బందులతో కార్మికుల ఆత్మహత్య

- అనారోగ్య సమస్యలు సైతం..
- చేనేత, జౌళిశాఖ ఏడీ సాగర్

సిరిసిల్ల: సిరిసిల్ల, తంగళ్లపల్లిల్లో గురువారం ఇద్దరు నేత కార్మికుల ఆత్మహత్యలకు ఆర్థిక ఇబ్బందులు, అనారోగ్య సమస్యలే కారణమని సిరిసిల్ల చేనేత, జౌళిశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ మిట్టకోల సాగర్ శుక్రవారం తెలిపారు. తంగళ్లపల్లి మండలం ఇందిరానగర్‌కు చెందిన అంకారపు మల్లేశం(60) గతంలో కారంపురి సురేశ్ అనే ఆసామి వద్ద మరమగ్గాల కార్మికుడిగా పని చేశాడని, అతని కుమార్తె వివాహం, మూడు నెలల క్రితం అతని భార్యకు కాలు విరిగిందని ఏడీ పేర్కొన్నారు. వీటన్నింటికి రూ.3లక్షల వరకు అప్పులు కావడంతో మనస్థాపానికి గురై ఆత్మహత్యకు పాల్పడినట్లుగా తమ విచారణలో తేలిందన్నారు. పద్మనగర్‌కు చెందిన వార్పిన్ కార్మికుడు అడిచెర్ల సాయికుమార్(27) గోవింద్ కనకయ్య, గాజుల నారాయణ వద్ద వార్పర్‌గా పనిచేసి మానేశాడని, రెండేళ్లుగా పనిలేకుండా ఉన్నాడని, తండ్రి కైలాసం నాలుగేళ్లుగా పక్షవాతంతో బాధపడుతున్నాడని తెలిపారు. సాయికి కూడా రెండేళ్లుగా పక్షవాతం లక్షణాలు, కిడ్నీ సమస్యలు ఉన్నాయని వివరించారు. అనారోగ్య సమస్యలతో మనస్థాపానికి గురై ఆత్మహత్య చేసుకున్నట్లుగా తమ విచారణలో తేలిందన్నారు. మల్లేశం, సాయికుమార్‌లు నేతన్నకు చేయూత, నేతన్నబీమా పథకంలో చేరలేదని ఏడీ స్పష్టం చేశారు. ప్రతీ నేత కార్మికుడు ఈ పథకంలో చేరాలని కోరినా ఆసక్తి చూపకపోవడంతో బీమాకు దూరమయ్యారని తెలిపారు. పని లేక ఎవరూ ఇబ్బంది పడడం లేదని, ఆర్థిక ఇబ్బందులు, అనారోగ్య సమస్యలతోనే ఇద్దరు ఆత్మహత్యకు పాల్పడినట్లు ఆయన స్పష్టం చేశారు.

విస్తృత తనిఖీలు

- రూ.50వేల కంటే ఎక్కువ తీసుకెళ్లొద్దు
- ఎస్పీ అఖిల్‌మహాజన్
- ఈవీఎం స్ట్రాంగ్‌రూమ్ పరిశీలన


స్ట్రాంగ్‌రూమ్ తనిఖీ చేస్తున్న ఎస్పీ

వేములవాడ: పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో కోడ్ అమలులో ఉండడంతో ఎలాంటి ధ్రువీకరణపత్రాలు లేకుండా రూ.50వేల కంటే ఎక్కువ నగదు తీసుకెళ్లొద్దని ఎస్పీ అఖిల్ మహాజన్ సూచించారు. వేములవాడలోని తిప్పాపూర్ ప్రాంతంలో శుక్రవారం వాహనాల తనిఖీ చేపట్టారు. అనంతరం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఈవీఎం స్ట్రాంగ్‌రూమ్‌లను పరిశీలించారు. ఆర్డీవో రాజేశ్వర్, తహసీల్దార్ మహేశ్, డీఎస్పీ నాగేంద్రచారి, టౌన్ సీఐ వీరప్రసాద్, ఎస్సైలు అంజయ్య, గోపాల్ రెడ్డి, ట్రాఫిక్ ఎస్సై దిలీప్ పాల్గొన్నారు.

వేములవాడ టౌన్ సీఐగా వీరప్రసాద్

వేములవాడ: వేములవాడ టౌన్ సీఐగా వీరప్రసాద్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. మార్చి 30న సీఐ కరుణాకర్ బదిలీకాగా.. రూరల్ సీఐ శ్రీనివాస్‌కు టౌన్ ఇన్‌చార్జి బాధ్యతలు నెరవేర్చారు. ఎన్నికల బదిలీల్లో భాగంగా నిజామాబాద్ కమిషనరేట్ పరిధిలో సీసీఎస్ సీఐగా పనిచేస్తున్న వీరప్రసాద్‌ను వేములవాడ టౌన్ సీఐగా బదిలీ చేశారు.

బీఆర్‌ఎస్‌ది మొసలి కన్నీరు

- కాంగ్రెస్ చేనేతసెల్ జిల్లా అధ్యక్షుడు ఎల్లప్ప



మాట్లాడుతున్న నాయకులు

సిరిసిల్లటౌన్: బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలోనే వస్త్ర పరిశ్రమకు బకాయిలు పడిందని ఇప్పుడు ఆ పార్టీ నేతలే నేతకార్మికులపై మొసలి కన్నీరు కారుస్తున్నారని కాంగ్రెస్ చేనేత సెల్ జిల్లా అధ్యక్షుడు గోనె ఎల్లప్ప విమర్శించారు. సిరిసిల్ల ప్రెస్‌క్లబ్‌లో శుక్రవారం విలేకరులతో మాట్లాడారు. నేతకార్మికులకు యారన్ సబ్సిడీ ఇవ్వలేదని, బతుకమ్మ చీరల బకాయిలు బీఆర్‌ఎస్ ప్రభుత్వమే పెండింగ్ పెట్టిందన్నారు. మంత్రిగా ఉన్న సమయంలో కేటీఆర్ బకాయిలు ఎందుకు అందించలేదని ప్రశ్నించారు. కాంగ్రెస్ మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు కాముని వనిత, నాయకులు గోలి వెంకటరమణ, కోడం అమర్, కాముని నళినీకాంత్, వెల్ముల తిరుపతిరెడ్డి, దుబాల వెంకటేశం పాల్గొన్నారు.

ఆయుష్మాన్ సేవలు సద్వినియోగం చేసుకోవాలి

- జిల్లా వైద్యాధికారి సుమన్‌మోహన్‌రావు


మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో సుమన్‌మోహన్‌రావు

ముస్తాబాద్(సిరిసిల్ల): ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్ పథకంలో ప్రజలకు ఉచితంగా 12 రకాల వైద్య సేవలు అందిస్తున్నామని, సద్వినియోగం చేసుకోవాలని జిల్లా వైద్యాధికారి సుమన్‌మోహన్‌రావు కోరారు. ముస్తాబాద్ మండలం ఆవునూర్, గూడెం, నామాపూర్, చీకోడు, తెర్లుమద్ది, బందనకల్ ఆరోగ్య ఉపకేంద్రాల్లో ఉచిత దంత, ఎముకల వైద్య శిబిరాలను శుక్రవారం నిర్వహించారు. డిప్యూటీ డీఎంహెచ్‌వో రజిత, వైద్యులు శ్రీనివాస్, శివరామకృష్ణ, శరన్‌నాజ్, సుష్మా, వైద్యాధికారి గీతాంజలి తదితరులు పాల్గొన్నారు.

కోచ్‌లకు దరఖాస్తుల ఆహ్వానం

సిరిసిల్లటౌన్: జిల్లా యువజన, క్రీడలశాఖ ఆధ్వర్యంలో సిరిసిల్లలో ఉచిత శిక్షణ శిబిరాలు నిర్వహిస్తున్నట్లు డీవైఎస్‌వో రాందాస్ శుక్రవారం ప్రకటనలో తెలిపారు. స్థానిక మినీస్టేడియంలో కరాటే, యోగా, వాలీబాల్, టేబుల్‌టెన్నిస్, షటిల్ బ్యాడ్మింటన్, క్రికెట్, బాస్కెట్‌బాల్, విలువిద్య(ఆర్చరీ), కబడ్డీ, అథ్లెటిక్స్‌లో శిక్షణ ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. శిక్షకులుగా సీనియర్ క్రీడాకారులు, పీఈటీలు, జాతీయ క్రీడాకారులు దరఖాస్తు చేసుకోవాలని కోరారు. ఎంపికైన కోచ్‌లకు గౌరవ వేతనం ఇవ్వనున్నట్లు తెలిపారు. ఆసక్తి గల వారు ఈనెల 29లోగా దరఖాస్తులు సమర్పించాలని సూచించారు. వివరాలకు 90594 65889, 75692 07411 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

1 నుంచి ఉచిత శిక్షణ శిబిరాలు

సిరిసిల్లక్రైం/వేములవాడ: సిరిసిల్ల, వేములవాడ సబ్‌డివిజన్‌ల పరిధిలోని 14 ఏళ్లు పైబడిన బాల, బాలికలకు వేసవి ఉచిత శిక్షణ శిబిరాలు నిర్వహిస్తున్నట్లు డీఎస్పీలు చంద్రశేఖర్‌రెడ్డి, నాగేంద్రచారి శుక్రవారం ప్రకటనలో తెలిపారు. సిరిసిల్ల, ఎల్లారెడ్డిపేట, వేములవాడ, కోనరావుపేట ఠాణాల పరిధిలో ఉచిత క్రీడా శిక్షణ శిబిరాలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఈనెల 29 వరకు దరఖాస్తు చేసుకోవాలని, మే 1వ తేదీ నుంచి 31వ తేదీ వరకు శిక్షణ కొనసాగుతుందని తెలిపారు. ఉదయం 6 నుంచి 8 గంటల వరకు వాలీబాల్, కబడ్డీ, పెయింటింగ్, అబాకస్, కరాటే, యోగా, ఆర్చరీ, డ్యాన్స్, అథ్లెటిక్స్, మార్షల్‌ఆర్ట్స్, కుండల తయారీలో శిక్షణ ఇవ్వనున్నట్లు వివరించారు.